




# DD9 వార్త
తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 222 | హైదరాబాద్, మార్చి, గురువారం 02, 2026 | పేజీలు : 06 వెల : 3.00


## బోథ్ డివిజన్లో గాలివాన భీభత్సం


04

## ఎండిన జూరాల.. నీళ్లు లేక విలవిల.. పాలమూరు ఆయకట్టుకు తప్పని జలకష్టం.!


డెడ్ స్టోరేజీకి చేరిన జూరాల ప్రాజెక్టు కోయిల్ సాగర్

ఆయకట్టుకు నీటి కష్టాలు తీవ్రం

నారాయణపూర్ నుంచి నీటి విడుదలకు ప్రభుత్వ ప్రయత్నాలు

కర్ణాటకతో చర్చలు..

5 టీఎంసీల కోసం విజ్ఞప్తి



**హైదరాబాద్, (డిడి9 వార్త):** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం జలకష్టంతో విలవిలలాడుతోంది. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు పడిపోవడంతో కోయిల్ సాగర్

..మిగతా 2లో

## రష్యాలో ఘోర విమాన ప్రమాదం

కుప్పకూలిన సైనిక విమానం

ఘటనలో 29 మంది మృతి

పర్వత శిఖరాన్ని ఢీకొన్న విమానం

మృతుల్లో 23 మంది ప్రయాణికులు, సిబ్బంది

సాంకేతిక లోపమే

కారణమని ప్రాథమిక అంచనా

పాత మోడల్ విమానాల భద్రతపై మళ్లీ చర్చ

గతంలోనూ ఇదే

మోడల్ విమానాలకు ప్రమాదాలు

అధికారిక దర్యాప్తు ప్రారంభం


03

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గుడ్ న్యూస్

**జీతాల చెల్లింపుల విధానం మార్పు**

**నేరుగా ఉద్యోగుల ఖాతాల్లోకి వేతనం**

**ఈ నెల నుంచే కొత్త విధానం అమల్లోకి**

**మధ్యవర్తుల వ్యవస్థకు ముగింపు**

**ఇంతకాలంపాటూ దోచుకు తిన్న దళారులు**

**ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల హర్షం**

**ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమల్లోకి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల చెల్లింపులో పారదర్శకతను పెంచుతూ, నెలల తరబడి ఎదురవుతున్న జాప్యానికి చెక్ పెట్టే దిశగా రాష్ట ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా జరుగుతున్న జీతాల చెల్లింపుల విధానాన్ని పూర్తిగా మారుస్తూ, ఇకపై నేరుగా ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లోకే వేతనాలు జమ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

ఈ కొత్త విధానం ప్రకారం మున్సిపాలిటీలు, గురుకుల విద్యాసంస్థలు, పాఠశాలలు, ఆరోగ్య శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి

..మిగతా 3లో



## మోడీ, విజయన్ ఒక్కటే



**ఇద్దరికీ ఒకే ఆలోచనా విధానం**

**ఎల్ డీఎఫ్, ఎన్డీయే మధ్య తేడా లేదు**

**ఇద్దరూ సమస్యలను పరిష్కరించరు**

**వారికి రాజకీయాలే ముఖ్యం..**

**అందుకే కాంగ్రెస్ కు ఓటేయండి**

**కేరళలో అభివృద్ధి జరగడం లేదు**

**స్పష్టమైన ప్రణాళిక ప్రభుత్వానికి లేదు**

**అందుకే రాష్ట్రం వెనుకబడుతోంది**

**కేరళలో తెలంగాణ**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచారం**



**హైదరాబాద్, (డిడి9 వార్త):** కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న వేళ రాజకీయ ఆరోపణలు, ప్రతిఆరోపణలు మరింత తీవ్ర రూపం దాల్చుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వం మరియు కేరళ ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేరళలోని ముట్టతారలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న ఆయన, ప్రధాని నరేంద్ర మోదీ మరియు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

..మిగతా 2లో

## ప్రభుత్వానిది మైనింగ్ స్కామ్.. నా పర్సనాలిటీపై ఏడిస్తే ఎలా..?

మైనింగ్ కుంభకోణంపై ప్రభుత్వాన్ని నిలదీసిన కౌశిక్ రెడ్డి

హౌస్ కమిటీ ఎందుకు వేయరని ప్రశ్నల వర్షం

ఎథిక్స్ కమిటీపై ఆగ్రహం.. వ్యక్తిగత వ్యాఖ్యలపై స్పందన

సిఐడి నోటీసులు, పోలీసులకు కౌశిక్ రెడ్డి వార్నింగ్

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ రాజకీయాల్లో మైనింగ్ కుంభకోణం , అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారాయి. తాజాగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మైనింగ్ స్కామ్ నుండి తన వ్యక్తిగత పర్సనాలిటీ వరకు ప్రతి అంశంపై ఆయన క్లారిటీ ఇస్తూనే, అధికార పార్టీ తీరును తప్పుబట్టారు. రాష్ట్రంలో జరుగుతున్న మైనింగ్ కుంభకోణంపై మాజీ మంత్రి హరీష్ రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా అన్ని విషయాలను బయటపెట్టారని కౌశిక్ రెడ్డి గుర్తు చేశారు. "నిజంగా ప్రభుత్వం దగ్గర సమాధానం ఉంటే హరీష్ రావు అడిగినట్లు హౌస్ కమిటీ ఎందుకు వేయడం లేదు?" అని ఆయన ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భాగస్వామ్యం ఉందని, ఆ కారణం చేతనే

..మిగతా 2లో



## తెలంగాణలో రేషన్ కార్డుల కలకలం.. ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తే కార్డు రద్దవుతుందా..?

IT రిటర్న్స్‌తో రేషన్ కార్డులపై భయం

గ్రామాల్లో అధికారుల క్షేత్రస్థాయి తనిఖీలు

టాక్స్ పేయర్ vs IT ఫైలర్ గందరగోళం

ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత లేదు


02

## అభివృద్ధి దిశగా బస్తర్ ప్రాంతం

**మావోయిస్టు రహితంగా సుక్మా జిల్లా**

**మావోల ప్రభావం నుంచి పూర్తిగా విముక్తి**

**అధికారికంగా ప్రకటించిన ఎస్పీ**

**ఇద్దరు కీలక మహిళా నక్సలైట్ల లొంగుబాటు**

**భారీ మొత్తంలో ఆయుధాలు, నగదు స్వాధీనం**

**భద్రతా దళాల దీర్ఘకాల ఆపరేషన్ల ఫలితం**

**వందల సంఖ్యలో లొంగుబాట్లు, అరెస్టులు**

**గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఊతం**

**బస్తర్ ప్రాంతంలో సాధారణ జీవనం పునరుద్ధరణ**



**హైదరాబాద్, (డిడి9 వార్త):** అనేక దశాబ్దాలుగా నక్సలిజం తీవ్ర ప్రభావం చూపిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా ఇప్పుడు పూర్తిగా మార్పు దిశగా అడుగులు వేస్తోంది. గతంలో మావోయిస్టుల కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతం, ఇప్పుడు భద్రతా దళాల కృషితో శాంతి మార్గంలో నడుస్తోంది. తాజాగా ఇద్దరు కీలక మహిళా నక్సలైట్లు లొంగిపోవడంతో, జిల్లా అధికార యంత్రాంగం సుక్మాను మావోయిస్టు ప్రభావం లేని జిల్లాగా ప్రకటించింది.

**లొంగుబాటుతో కీలక మలుపు**

మంగళవారం జరిగిన ఈ పరిణామం సుక్మా చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపుగా భావిస్తున్నారు. లొంగిపోయిన మహిళలు నక్సలైట్ సంస్థలో కీలక విభాగానికి

..మిగతా 2లో

## రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

5లక్షలు ఇచ్చామని చెప్పి 15లక్షలు తొలగించే కుట్ర

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత


02

## ప్రభుత్వానిది మైనింగ్ స్కామ్.. నా పర్సనాలిటీపై ఏడిస్తే ఎలా.?

**మొదటిపేజీ తరువాయి**

ఈ స్కామ్‌పై విచారణకు ప్రభుత్వం వెనకాడుతోందని ఆయన సంచలన ఆరోపణ చేశారు. తనపై ఎథిక్స్ కమిటీ వేయడంపై కౌశిక్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తనను టార్గెట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఎమ్మెల్యే దానం నాగేందర్ వాడిన భాష ఎథిక్స్ కమిటీ పరిధిలోకి రాదా అని నిలదీశారు. తన వ్యక్తిగత పర్సనాలిటీపై చేసిన కామెంట్లకు బదులిస్తూ.. "నేను స్పోర్ట్స్ పర్సన్‌ని. అండర్19 క్రికెట్ ఆడే సమయంలో దేశంలోనే ఫిట్టెస్ట్ ప్లేయర్‌గా ఉన్నాను. 20 ఏళ్ల కష్టం ఈ బాడీ. నా పర్సనాలిటీ మీద ఏడిస్తే ఎలా?" అంటూ ఘాటుగా స్పందించారు. ఎథిక్స్ కమిటీ ముందు అన్ని విషయాలను ధైర్యంగా చెబుతానని వెల్లడించారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కూడా కౌశిక్ రెడ్డి విమర్శలు సంధించారు. "కడియం శ్రీహరి గారు.. కేసీఆర్ మీకు ఏం తక్కువ చేశారు? అసలు మీరు ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో అసెంబ్లీలో స్పష్టం చేయమని అడిగితే తప్పేంటి?" అని ప్రశ్నించారు. కడియం వ్యవహారశైలిపై అసెంబ్లీలో తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం లేదని ఆయన పేర్కొన్నారు.



హుజురాబాద్‌లోని డంపింగ్ యార్డ్ ఏర్పాటును అడ్డుకోవడానికి తాను ఈ నెల 4న చేపట్టిన కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి సిఐడి నోటీసులు ఇచ్చారని కౌశిక్ రెడ్డి తెలిపారు. "కరీంనగర్ సీపీ మీద వేయాల్సిన సిఐడి ఎంక్వైరీ నా మీద వేశారు. 4వ తేదీన విచారణకు పిలిస్తే వెళ్తాను, కానీ 5 లేదా 6వ తేదీల్లో డంపింగ్ యార్డును అడ్డుకుని తీరుతాను" అని ప్రకటించారు. అలాగే, ప్రస్తుతం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న పోలీసు అధికారులపై మండిపడుతూ.. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సిఐడి విచారణలు పోలీసుల మెడకే చుట్టుకుంటాయని హెచ్చరించారు.

## మోడీ, విజయన్ ఒక్కటే

**మొదటిపేజీ తరువాయి**

విధానాలను లక్ష్యంగా చేసుకుని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**ముట్టతారలో రోడ్‌షో.. ఉత్సాహంగా ప్రచారం**

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ తరపున కేరళలో ప్రచారం నిర్వహిస్తున్న రేవంత్‌రెడ్డి, ముట్టతార ప్రాంతంలో భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, ప్రజలు హాజరై ఆయనకు స్వాగతం పలికారు. రేవంత్ ప్రసంగం ప్రారంభం నుంచే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాలపై విమర్శల వర్షం కురిపించారు.

**మోదీ – పినరయి మధ్య తేడా లేదని విమర్శ**

ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం పినరయి విజయన్ ఇద్దరి పాలనలో తేడా లేదని రేవంత్ ఆరోపించారు. ప్రజలకు మేలు చేయడంలో ఇద్దరూ విఫలమయ్యారని, రాజకీయ ప్రయోజనాల కోసం పరస్పరం సహకరిస్తున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టకుండా, రాజకీయ వ్యూహాలతోనే ముందుకు సాగుతున్నారని అన్నారు.

**కేరళ ప్రజలపై నమ్మకం**

కేరళ ప్రజలను తెలివైనవారిగా, రాజకీయంగా చైతన్యవంతులుగా రేవంత్ ప్రశంసించారు. విద్యావంతులైన ఈ రాష్ట్ర ప్రజలు మతతత్వ రాజకీయాలను తిరస్కరించే సంప్రదాయం కలిగి ఉన్నారని పేర్కొన్నారు. గతంలో కూడా తీవ్ర భావజాలాలను అడ్డుకున్న ప్రజలు, ఈసారి కూడా అదే తీర్పు ఇస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

**'లక్ష్మణరేఖ' గీసిన ప్రజలు**

కేరళలో మతతత్వ శక్తులకు అవకాశం ఇవ్వకుండా ప్రజలు 'లక్ష్మణరేఖ' గీసారని రేవంత్ అన్నారు. ఈ రాష్ట్ర రాజకీయ చరిత్రలో సహజసిద్ధమైన సామాజిక సమతుల్యత ఉందని, దాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అలాంటి శక్తులను అడ్డుకోవడం కేరళ ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు.

**అభివృద్ధి అడ్డుకునే ప్రయత్నాలు**

కేరళ భవిష్యత్తును దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని రేవంత్ ఆరోపించారు. అభివృద్ధి ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల విషయంలో స్పష్టమైన దిశ లేకపోవడం వల్ల రాష్ట్రం వెనుకబడుతోందని విమర్శించారు. ప్రజల అవసరాల కంటే రాజకీయ లాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు.

**కాంగ్రెస్‌ను అడ్డుకునే కుట్ర**

కేరళలో కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాలు గెలవకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని రేవంత్ ఆరోపించారు. రాజకీయంగా బలమైన ప్రత్యామ్నాయంగా ఉన్న కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి బీజేపీ, ఎల్‌డీఎఫ్ మధ్య అవగాహన ఉందని వ్యాఖ్యానించారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు.

**ఓటు బ్యాంకు మార్పిడి ఆరోపణ**

బీజేపీ ఓటు బ్యాంకును ఎల్‌డీఎఫ్‌కు బదిలీ చేసేలా రాజకీయ వ్యూహాలు అమలు చేస్తున్నారని రేవంత్ ఆరోపించారు. ఇది ప్రజల తీర్పును ప్రభావితం చేసే ప్రయత్నమని, పారదర్శకతకు విరుద్ధమని విమర్శించారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు.

**ప్రజలకు పిలుపు**

ఈ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక సమతుల్యతను కాపాడగల నాయకత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు.

**కాంగ్రెస్ విజయం లక్ష్యం**

కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి విజయమే రాష్ట్రానికి మంచిదని రేవంత్ అభిప్రాయపడ్డారు. ప్రజల ఆశలను నెరవేర్చగలిగేది కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించడానికి యూడీఎఫ్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు.



మొత్తంగా కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒకేసారి విమర్శలు గుప్పించడం ద్వారా కాంగ్రెస్ వ్యూహాన్ని స్పష్టం చేశారు. కేరళ ప్రజల నిర్ణయమే రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించనుందని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకమని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణలో రేషన్ కార్డుల కలకలం.. ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తే కార్డు రద్దవుతుందా.?

- **IT రిటర్న్స్‌తో రేషన్ కార్డులపై భయం**
- **గ్రామాల్లో అధికారుల క్షేత్రస్థాయి తనిఖీలు**
- **టాక్స్ పేయర్ vs IT ఫైలర్ గందరగోళం**
- **ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత లేదు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డు లబ్ధిదారుల్లో ప్రస్తుతం ఒక కొత్త భయం పట్టుకుంది. ఆదాయపన్ను రిటర్న్స్ (IT Returns) దాఖలు చేసిన వారి రేషన్ కార్డులు రద్దు కానున్నాయనే ప్రచారం గ్రామాల్లో తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. ప్రభుత్వ పథకాలకు ప్రామాణికంగా ఉన్న రేషన్ కార్డు ఎక్కడ చేజారిపోతుందోనని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామ పరిపాలన అధికారులు (GPOలు) నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి విచారణ చేస్తుండటంతో ఈ ప్రచారం మరింత వేగవంతమైంది. ముఖ్యంగా వార్షికాదాయం రూ. 6 లక్షల కంటే ఎక్కువ చూపించి ఐటీ రిటర్న్స్ ఫైల్ చేసిన వారి వివరాలను ఆదాయపన్ను శాఖ నుంచి సేకరించిన అధికారులు, వారి అర్హతపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 30,186 మంది, సిద్దిపేట జిల్లాలో 14,200 మందిపై ఈ విచారణ జరుగుతున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఖ్య లక్షల్లో ఉండే అవకాశం ఉంది.

రేషన్ కార్డు కేవలం బియ్యం కోసమే కాకుండా, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ వంటి కీలక సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా మారింది. ఒకవేళ కార్డు రద్దయితే ఈ పథకాలన్నీ నిలిచిపోతాయనే భయం ప్రజల్లో నెలకొంది. అయితే, ఆదాయపన్ను చెల్లించే వారికి (Tax Payers), కేవలం రిటర్న్స్ దాఖలు చేసే వారికి (IT Filers) మధ్య చాలా తేడా ఉంటుంది. చాలామంది చిన్న వ్యాపారులు బ్యాంక్ రుణాలు పొందడం కోసమో లేదా డిజిటల్ లావాదేవీల ద్వారా కట్ అయిన TDS రీఫండ్ క్లెయిమ్ చేయడం కోసమో తక్కువ ఆదాయం ఉన్నప్పటికీ రిటర్న్స్ దాఖలు చేస్తుంటారు. ఇప్పుడు విచారణ పేరుతో తమ కార్డులు ఎక్కడ తొలగిస్తారోనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రేషన్ కార్డుల రద్దుపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కేవలం అనర్హులను గుర్తించే ప్రక్రియలో భాగంగానే ఈ విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో సేకరించిన నివేదికల ఆధారంగా ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అర్హులైన పేదలకు అన్యాయం జరగకుండా, కేవలం అక్రమంగా కార్డులు పొందిన వారిని మాత్రమే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఆదాయపన్ను రిటర్న్స్ ఫైల్ చేసిన ప్రతి ఒక్కరినీ అనర్హులుగా ముద్ర వేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు.



## రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

- **5లక్షలు ఇచ్చామని చెప్పి 15లక్షలు తొలగించే కుట్ర**
- **ప్రభుత్వ తీఈరుపై మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలో పేదలను రేవంత్ రెడ్డి సర్కార్ వేధిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేషన్ కార్డుల ఏరివేత అనే దుర్మార్గపు చర్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత సీరియస్ అయ్యారు. పేదలకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకుంటూ.. మరోవైపు 15 లక్షల కార్డులు తొలగించే ప్రయత్నం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవుపలికారు. కొండగట్టు చలువ పందిళ్ల ప్రమాదంపైనా కవిత స్పందించారు. పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు. హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం పందిళ్లు వేయడంతోనే ప్రమాదం జరిగిందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. గాయపడిన భక్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



## ఎండిన జూరాల.. నీళ్లు లేక విలవిల.. పాలమూరు ఆయకట్టుకు తప్పని జలకష్టం.!

**మొదటిపేజీ తరువాయి**

లిఫ్ట్ మోటార్లకు నీరు అందడం లేదు. దీని ప్రభావం కోయిల్ సాగర్ చివరి ఆయకట్టుపై తీవ్రంగా పడుతోంది, సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కోయిల్ సాగర్ ఆయకట్టును ఆదుకోవడానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే జీఎంఆర్ (జి. మధుసూదన్ రెడ్డి) ప్రభుత్వాన్ని , సంబంధిత మంత్రిని కోరారు.

మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న ఈ సాగునీటి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో ఫోన్ లో మాట్లాడి, జూరాలకు కనీసం 5 టీఎంసీల నీటిని తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కేవలం ఫోన్ సంప్రదింపులకే పరిమితం కాకుండా, ఈ సమస్య పరిష్కారం కోసం పాలమూరు జిల్లాకు చెందిన మంత్రులు , ఎమ్మెల్యేల బృందం మరో వారం రోజుల్లో బెంగళూరు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నేరుగా కలవాలని నిర్ణయించుకుంది. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నీటిని విడుదల చేస్తేనే పాలమూరు గడ్డపై ఎండిపోతున్న పంటలకు ప్రాణం పోసే అవకాశం ఉంటుంది.



## అభివృద్ధి దిశగా బస్తర్ ప్రాంతం

**మొదటిపేజీ తరువాయి**

చెందినవారిగా గుర్తించారు. వీరు సాయుధ దళాల్లో చురుకుగా పాల్గొంటూ, అడవుల్లో కార్యకలాపాలు నిర్వహించేవారని పోలీసులు తెలిపారు.వీరిద్దరిపై కలిపి లక్షల రూపాయల రివార్డు ఉండటం, వారి ప్రాధాన్యతను స్పష్టంగా చూపుతోంది. వీరి లొంగుబాటు ఇతర నక్సలైట్లకు కూడా ఒక సందేశంగా మారిందని అధికారులు పేర్కొన్నారు.

**ఆయుధాలు, నగదు స్వాధీనం**

లొంగిపోయిన నక్సలైట్ల నుంచి భద్రతా సిబ్బంది భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఆధునిక ఆటోమేటిక్ తుపాకులు కూడా ఉన్నాయి. అదేవిధంగా గణనీయమైన మొత్తంలో నగదు కూడా స్వాధీనం కావడం గమనార్హం.ఈ స్వాధీనం ద్వారా నక్సలైట్ల కార్యకలాపాలు ఎంతగా వ్యవస్థీకృతంగా సాగుతున్నాయో స్పష్టమవుతోంది. అయితే ఇలాంటి నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేయడంలో భద్రతా దళాలు క్రమంగా విజయాన్ని సాధిస్తున్నాయి.

**రెండేళ్ల ఆపరేషన్ల ఫలితం**

గత రెండు సంవత్సరాలుగా సుక్మా అటవీ ప్రాంతాల్లో భద్రతా దళాలు క్రమబద్ధంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. అడవుల్లో లోతైన ప్రాంతాలకు చేరుకుని నక్సలైట్ల స్థావరాలను గుర్తించి, వాటిపై దాడులు చేపట్టాయి.ఈ ఆపరేషన్ల ఫలితంగా అనేక మంది నక్సలైట్లు మరణించగా, వందల సంఖ్యలో అరెస్టులు జరిగాయి. ముఖ్యంగా యువతలో మార్పు తీసుకురావడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు.

**లొంగుబాట్ల పెరుగుదల**

ఇటీవలి కాలంలో నక్సలైట్లు స్వచ్ఛందంగా లొంగిపోవడం గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాలు, భద్రతా హామీలు దీనికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు.లొంగిపోయిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం, సామాజికంగా పునరావాసం కల్పించడం వంటి చర్యలు వారికి కొత్త జీవితం ప్రారంభించే అవకాశాన్ని ఇస్తున్నాయి.

**అభివృద్ధి పనులకు ఊపు**

భద్రత మెరుగుపడడంతో సుక్మా జిల్లాలో అభివృద్ధి పనులు వేగం అందుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, విద్య, వైద్య సదుపాయాల విస్తరణ వంటి పనులు జరుగుతున్నాయి.ప్రస్తుతం జిల్లాలో అనేక రహదారి ప్రాజెక్టులు అమలు దశలో ఉన్నాయి. ఇవి పూర్తయితే దూర ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుంది. అలాగే ప్రభుత్వ సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయి.

**యువతలో మార్పు కోసం క్రీడలు**

యువతను తప్పుదారి పట్టకుండా ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గ్రామాల్లో క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తూ, యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నారు.ఇది వారిని సానుకూల దిశగా నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. క్రీడల ద్వారా సామాజిక చైతన్యం కూడా పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు.



**బస్తర్‌లో మారుతున్న పరిస్థితులు**

బస్తర్ ప్రాంతం గతంలో తీవ్ర హింసకు కేంద్రంగా ఉండేది. అయితే ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. గ్రామాల్లో పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, రేషన్ దుకాణాలు ఏర్పడుతున్నాయి.ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో వారి జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయి. ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాలకు చేరడం కూడా పరిస్థితి మార్పుకు దోహదపడుతోంది.

**ప్రజల్లో పెరుగుతున్న నమ్మకం**

భద్రతా దళాల చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలు కలిసి ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతున్నాయి. గతంలో భయంతో జీవించిన ప్రజలు ఇప్పుడు సాధారణ జీవితం వైపు అడుగులు వేస్తున్నారు. పిల్లలు పాఠశాలలకు వెళ్లడం, రైతులు వ్యవసాయం చేయడం వంటి సాధారణ కార్యకలాపాలు మళ్లీ పునరుద్ధరించబడుతున్నాయి.సుక్మా జిల్లాలో జరిగిన ఈ మార్పు ఒక ముఖ్యమైన ఉదాహరణగా నిలుస్తోంది. కఠినమైన భద్రతా చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యం కలిపి ఒక ప్రాంతాన్ని ఎలా మార్చగలవో ఇది చూపిస్తోంది.ఇక ముందు కూడా ఇదే దిశగా చర్యలు కొనసాగితే, పూర్తిగా నక్సలిజం సమస్యను నిర్మూలించగలమనే ఆశాభావం వ్యక్తమవుతోంది. సుక్మా నుంచి ప్రారంభమైన ఈ మార్పు, ఇతర ప్రభావిత ప్రాంతాలకు కూడా ప్రేరణగా నిలుస్తోంది.

## నేడు ఎంపీఆర్ కార్యాలయంలో సన్మాన సభ

**బోధన్, నిజామాబాద్ జిల్లా 01 ఏప్రిల్ (డీడీ9 వార్త) :**

ఎంపీఆర్ ఫౌండేషన్ అధినేత, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి ద్వితీయసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన తర్వాత నేడు మొదటిసారి బోధన్ పట్టణానికి విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా బోధన్ రూరల్ మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో ఆయనకు ఘన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు బోధన్ మండల పార్టీ అధ్యక్షులు సిర్ప సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటలకు బోధన్‌లోని ఎంపీఆర్ కార్యాలయంలో ఈ సన్మాన సభ జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో పార్టీ కీలక బాధ్యతలు చేపట్టిన ప్రకాష్ రెడ్డిని గౌరవించుకునే ఈ కార్యక్రమానికి బోధన్ రూరల్ మండల పరిధిలోని బిజెపి కుటుంబ సభ్యులు, నాయకులు మరియు కార్యకర్తలు అందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# పండిత్ దీన్దయాల్ ప్రశిక్షణ శిబిరం" కార్యక్రమం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఏప్రిల్ 01 (డి డి వార్త ):**



సోనాల మండలంలో*బిజెపి రాష్ట్ర, మరియు జిల్లా పార్టీ ఆదేశానుసారం "పండిత్ దీన్దయాల్ ప్రశిక్షణ శిబిరం" కార్యక్రమం ఏర్పాటు లో భాగంగా మూడు మండలాలు (బోథ్, సోనాలా, బజార్ హత్నూర్) కలపి సోనాలలో (మున్నూరు కాపు సంఘ భవనం) లో శిక్షణ శిబిరం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిక్షణా శిబిరంలో మండలం లోని తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు శక్తి కేంద్ర ఇంచార్జ్ లు బూత్ అధ్యక్షులు పార్టీ యొక్క సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ శిక్షణ శిబిరంలో పార్టీ యొక్క స్థితిగతులు మరియు పార్టీ ఎలా స్థాపించబడింది. పార్టీ యొక్క ముఖ్యమైన విషయాలు పార్టీ బలోపేతానికి చేయవలసిన కార్యక్రమాల గురించి మాట్లాడడం జరిగింది. ఈ శిక్షణ శిబిరానికి బిజెపి జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానందం.మరియు వ్యవస్థా ప్రముఖ జివి రమణ గారు మరియు మండలాల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# సోనాల మండల కేంద్రంలో జొన్న ఒక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని RI గారికి వినతి పత్రం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఏప్రిల్ 01(డి డి 9వార్త )**

సోనాల మండల కేంద్రంలోని జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఆర్ ఐ గారికి వినతిపత్రం ఇచ్చిన రైతులు. రైతులు తమ పంటను అమ్ముకునేందుకు దూర ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తుంది. దీనివల్ల సమయం రవాణా ఖర్చులు పెరిగి తిరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను తెలిపారు. స్థానికంగా కొనుగోలు ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో సౌలభ్యం కలుగుతుంది కలుగుతుందని వారు పేర్కొన్నారు. సోనాల మండలంలో రైతులు కోరుతున్నారు . ఈ కార్యక్రమంలో రైతులు రామ్ రెడ్డి, శ్రీకాంత్,లక్ష్మయ్య, మైపాల్ రెడ్డి, సుధీర్ రెడ్డి, అభిలాష్, హరీష్ సుగుణాకర్, సంతోష్, శ్రీనివాస్.విలాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.




# నేడు ఇందూరులో ట్రాఫిక్ ఆంక్షలు

- **శోభాయాత్ర మార్గాల్లో వాహనాల పార్కింగ్ నిషిద్ధం**

**నిజామాబాద్ జిల్లా 01 ఏప్రిల్ (డీడీ9 వార్త) :**

నిజామాబాద్ నగరంలో ఈ రోజు జరగనున్న హనుమాన్ శోభాయాత్రను పురస్కరించుకుని ట్రాఫిక్ పోలీసులు నగరవ్యాప్తంగా ఆంక్షలు విధించారు. కంఠేశ్వర్ ఆలయం నుంచి ప్రారంభమై జడ్పీ చౌరస్తా, హమాల్వాడీ, రైల్వే ఫ్లైఓవర్, గోదాం రోడ్, దేవి రోడ్, గాంధీ చౌక్, నెహ్రూ పార్క్ మీదుగా ఆర్ఆర్ చౌరస్తా వరకు సాగే ఈ యాత్ర దృష్ట్యా వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ సూచించారు. ముఖ్యంగా శోభాయాత్ర సాగే ప్రధాన కూడళ్లలో బుధవారం రాత్రి 8 గంటల నుంచే రోడ్లపై వాహనాల నిలుపుదలను పూర్తిగా నిషేధించారు. వ్యాపారులు, నివాసితులు తమ వాహనాలను రోడ్లపై పార్క్ చేసి ట్రాఫిక్ అంతరాయం కలిగించవద్దని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం బస్సుల మార్గాల్లో భారీ మార్పులు చేశారు. హైదరాబాద్, ఆదిలాబాద్, వరంగల్ వైపు వెళ్లే ఆర్టీసీ మరియు ప్రైవేటు బస్సులు బస్టాండ్ నుంచి జడ్పీ రోడ్, సుభాష్ నగర్ రామాలయం, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ జంక్షన్, కాజా హోటల్ మీదుగా కంటేశ్వర్ బైపాస్ చేరుకోవాల్సి ఉంటుంది. అలాగే బోధన్ నుంచి వచ్చే వాహనాలను అర్సపల్లి రైల్వే గేట్ వద్ద మళ్లించి కొత్త కలెక్టరేట్, కాజా హోటల్ మీదుగా బస్టాండ్‌కు అనుమతిస్తారు. బాన్సువాడ వైపు నుంచి వచ్చే వాహనాలు వర్నీ చౌరస్తా, పులాంగ్ సర్కిల్, కోర్ట్ సర్కిల్ మీదుగా రైల్వే స్టేషన్ మరియు బస్టాండ్‌కు చేరుకోవాలి. శోభాయాత్ర సందర్భంగా నగర ప్రజలు ఈ మార్పులను గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.




# ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి

ఈ విధానం వర్తించనుంది. ఏప్రిల్ నెల నుంచి ఈ కొత్త చెల్లింపు వ్యవస్థ అమల్లోకి రానుండటంతో, వేలాది మంది ఉద్యోగులకు ఇది పెద్ద ఊరటగా మారనుంది.

**మధ్యవర్తుల వ్యవస్థకు ముగింపు**

ఇప్పటివరకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా విడుదల అవుతుండటంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఏజెన్సీలు కొంతమేర కమిషన్ కట్ చేయడం, వేతనాలు ఆలస్యం చేయడం, కొన్ని సందర్భాల్లో పూర్తిగా నెలల తరబడి జీతాలు నిలిపివేయడం వంటి ఆరోపణలు వినిపించాయి. ఈ పరిస్థితి కారణంగా ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మధ్యవర్తుల పాత్రను తగ్గిస్తూ, నేరుగా ప్రభుత్వ ఖజానా నుంచి ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేసే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. దీని ద్వారా ఏజెన్సీలపై ఆధారపడే అవసరం లేకుండా పోతుంది.

**IFMS విధానంలోకి కాంట్రాక్ట్ ఉద్యోగులు**

శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం అమలులో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (IFMS) విధానాన్ని ఇప్పుడు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి విస్తరించనున్నారు. ఈ విధానం ద్వారా జీతాల చెల్లింపులు పూర్తిగా డిజిటల్, పారదర్శకంగా,




రియల్ టైమ్‌లో జరుగుతాయి.

ప్రభుత్వం ఇప్పటికే ఈ ప్రక్రియకు సంబంధించిన సాంకేతిక, పరిపాలనా ఏర్పాట్లను వేగవంతం చేసింది. అన్ని జిల్లాల అధికారులు ఉద్యోగుల వివరాలను సేకరించి, వారి ఆధార్ నంబర్లను బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేశారు. ఈ డేటాను ఉన్నతాధికారులకు కూడా పంపించినట్లు సమాచారం.

**మున్సిపల్ కార్మికుల సమస్యలకు పరిష్కారం**

ఈ నిర్ణయం ముఖ్యంగా మున్సిపల్ విభాగాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు వంటి వర్గాలకు పెద్ద ఉపశమనం కలిగించనుంది. గతంలో స్థానిక పన్నుల వసూళ్లపై ఆధారపడి జీతాలు చెల్లించాల్సిన పరిస్థితి ఉండేది. పన్నులు సకాలంలో వసూలు కాకపోతే వేతనాలు నెలల తరబడి నిలిచిపోయేవి.

దీంతో కార్మికులు తమ రోజువారీ అవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్న పరిస్థితులు చోటు చేసుకున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆర్థిక ఒత్తిడి తీవ్రమై జీవనోపాధిపై ప్రభావం చూపిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయడం ద్వారా, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీకి వేతనాలు జమ అయ్యే అవకాశం ఏర్పడనుంది. ఇది ఉద్యోగుల ఆర్థిక స్థిరత్వానికి దోహదం చేస్తుందని అధికారులు భావిస్తున్నారు.

**పారదర్శకత పెంపు లక్ష్యం**

ఈ కొత్త విధానం ప్రధాన లక్ష్యం పరిపాలనలో పారదర్శకతను పెంచడం, జీతాల చెల్లింపులో జాప్యాన్ని పూర్తిగా తొలగించడం. ఏజెన్సీల మధ్య మధ్యవర్తిత్వం తొలగిపోవడంతో నిధుల వినియోగంపై స్పష్టమైన నియంత్రణ ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

అదే విధంగా, ఉద్యోగుల వివరాలు డిజిటల్‌గా నమోదు కావడం వల్ల డూప్లికేషన్, అక్రమ నియామకాలు, అనవసర లీకేజీలకు కూడా అడ్డుకట్ట పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**డిజిటల్ చెల్లింపుల దిశగా ప్రభుత్వం**

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వివిధ శాఖల్లో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తోంది. జీతాలు, పింఛన్లు, సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని విస్తృతంగా అమలు చేస్తోంది. ఈ క్రమంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను కూడా అదే వ్యవస్థలోకి తీసుకురావడం ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. జీతాల ఆలస్యం, ఏజెన్సీల ఇబ్బందులు తగ్గుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా నిర్దిష్ట తేదీకి జీతం వస్తే ఆర్థిక ప్రణాళికలు సులభమవుతాయని ఉద్యోగులు భావిస్తున్నారు.

**భవిష్యత్తులో మరిన్ని సంస్కరణలు**

ఈ విధానం విజయవంతమైతే మరిన్ని శాఖల్లో కూడా ఇలాంటి నేరుగా చెల్లింపుల విధానాన్ని విస్తరించే అవకాశం ఉందని అధికార వర్గాలు సూచిస్తున్నాయి. ప్రభుత్వ సేవలలో సమర్థత, పారదర్శకత పెంచేందుకు ఇది ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. మొత్తంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో పెద్ద మార్పు తీసుకురానుంది. మధ్యవర్తుల వ్యవస్థకు ముగింపు పలుకుతూ, నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జీతాలు జమ చేయడం ద్వారా పారదర్శకత, వేగం, విశ్వసనీయత పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. ఏప్రిల్ నుంచి అమల్లోకి రానున్న ఈ విధానం వేలాది కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించే దిశగా కీలక అడుగుగా నిలుస్తుందని చెప్పవచ్చు.

# రష్యాలో ఘోర విమాన ప్రమాదం

- **కుప్పకూలిన సైనిక విమానం**
- **ఘటనలో 29 మంది మృతి**
- **పర్వత శిఖరాన్ని ఢీకొన్న విమానం**
- **మృతుల్లో 23 మంది ప్రయాణికులు, సిబ్బంది**
- **సాంకేతిక లోపమే కారణమని ప్రాథమిక అంచనా**
- **పాత మోడల్ విమానాల భద్రతపై మళ్లీ చర్చ**
- **గతంలోనూ ఇదే మోడల్ విమానాలకు ప్రమాదాలు**
- **అధికారిక దర్యాప్తు ప్రారంభం**

క్రిమియా ప్రాంతంలో రష్యాకు చెందిన సైనిక రవాణా విమానం కుప్పకూలిన విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మృతుల్లో 23 మంది ప్రయాణికులు, 6 మంది సిబ్బంది ఉన్నారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకున్నట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది.

సైనిక అవసరాల కోసం ఉపయోగించే ఈ విమానం సాధారణ షెడ్యూల్ ప్రయాణంలో ఉండగా ఒక్కసారిగా భూమి నియంత్రణ కేంద్రంతో సంప్రదింపులు కోల్పోయింది. ఆ తరువాత కొద్దిసేపటికే విమానం క్రిమియా ప్రాంతంలోని కొండ ప్రాంతంలో ఢీకొని కుప్పకూలినట్లు అధికారులు తెలిపారు.సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో విమానం తన గమ్యస్థానానికి వెళ్తుండగా అకస్మాత్తుగా కమ్యూనికేషన్ నిలిచిపోయింది. నియంత్రణ కేంద్రం పలుమార్లు సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ ఎటువంటి స్పందన రాలేదు. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు శోధన చర్యలు ప్రారంభించారు.కొద్ది గంటల తర్వాత విమానం శిథిలాలు ఒక కొండ ప్రాంతంలో కనిపించాయి. ప్రమాదం తీవ్రతను బట్టి ఎవరూ ప్రాణాలతో బయటపడే అవకాశాలు లేవని ప్రాథమికంగా అంచనా వేశారు.

**పర్వతాన్ని ఢీకొన్న విమానం**

విమాన శకలాలు కొండపై చెల్లాచెదురుగా పడినట్లు రక్షణ బృందాలు గుర్తించాయి. ఇది విమానం నేరుగా పర్వతాన్ని ఢీకొని పేలిపోయినట్లు సూచిస్తోంది. ప్రమాద సమయంలో భారీ శబ్దం వినిపించినట్లు సమీప గ్రామాల ప్రజలు తెలిపారు.అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని శోధన చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికి తీసే పనులు రాత్రంతా కొనసాగాయి.

**సాంకేతిక లోపం అనుమానం**

ప్రాథమిక విచారణలో ఈ ప్రమాదానికి సాంకేతిక సమస్యలే కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. విమానం పాత మోడల్‌కు చెందినదిగా ఉండటం, నిర్వహణలో లోపాలు ఉండే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.అయితే పూర్తి వివరాలు అధికారిక దర్యాప్తు పూర్తయ్యాకే వెల్లడవుతాయి. విమానంలోని బ్లాక్‌బాక్స్‌ను కూడా శోధిస్తున్నారు.

**పాత మోడల్ విమానాలపై సందేహాలు**

ఈ ఘటనతో పాత సైనిక విమానాల భద్రతపై మళ్లీ చర్చ మొదలైంది. దశాబ్దాలుగా సేవలో ఉన్న విమానాలు ఇప్పటికీ వినియోగంలో ఉండటం ప్రమాదకరమని విమానయాన నిపుణులు హెచ్చరిస్తున్నారు.ప్రమాదంలో చిక్కుకున్న ఈ విమానం 1960ల కాలానికి చెందిన



మోడల్‌గా గుర్తించారు. ఈ రకం విమానాలు సరుకు రవాణా కోసం కూడా ఉపయోగిస్తారు.

**గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు**

ఇదే రకం విమానాలకు గతంలో కూడా అనేక ప్రమాదాలు జరిగినాయి. కొన్ని సంవత్సరాల క్రితం కూడా ఇలాంటి విమానం శిక్షణ సమయంలో కూలిపోవడంతో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు.మరో ఘటనలో ల్యాండింగ్ సమయంలో జరిగిన ప్రమాదంలో పలువురు మృతి చెందారు. ఈ ఘటనలు అన్ని కలిపి చూస్తే ఈ విమాన మోడల్‌పై భద్రతా సందేహాలు పెరుగుతున్నాయి.

**దర్యాప్తు ప్రారంభం**

ఈ ప్రమాదంపై రష్యా రక్షణ శాఖ పూర్తి స్థాయి దర్యాప్తు ప్రారంభించింది. సాంకేతిక లోపమా, మానవ తప్పిదమా లేదా వాతావరణ పరిస్థితుల ప్రభావమా అన్న దానిపై విచారణ జరుగుతోంది.సంఘటనపై ఉన్నత స్థాయి కమిటీని నియమించినట్లు సమాచారం. బాధితుల కుటుంబాలకు సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**స్థానికుల్లో ఆందోళన**

ప్రమాదం జరిగిన ప్రాంతంలోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పెద్ద శబ్దంతో పేలుడు జరిగినట్లు వారు తెలిపారు. ప్రమాదం కారణంగా కొండ ప్రాంతంలో మంటలు చెలరేగినట్లు సమాచారం.రక్షణ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చి, ప్రాంతాన్ని పూర్తిగా నియంత్రణలోకి తీసుకున్నారు.

ఈ విషాద ఘటన రష్యా సైన్యంలో విషాదాన్ని మిగిల్చింది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఇది తీరని నష్టం. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.ఈ ఘటనతో పాత విమానాల వినియోగంపై ప్రపంచవ్యాప్తంగా మరోసారి చర్చ మొదలైంది. విమానయాన భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సమగ్ర సంస్కరణలు అవసరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో 3 కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు

- **ధన్నూర్, కుప్టి, కుచులపూర్ విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు**
- **విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఈనెల 6వ తేదీన భూమిపూజ**
- **బోథ్ మండలంలోని ధన్నూర్ బి గ్రామంలో మంజూరు అయిన విద్యుత్ సబ్ స్టేషన్ స్థలాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఏప్రిల్ 01(డి డి 9వార్త )**

బోథ్ నియోజకవర్గ ప్రజలు తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు.బోథ్ మండలంలోని ధన్నూర్ బి గ్రామంలో, నెరడిగొండ మండలంలోని కుప్టి గ్రామంలో, తలమడుగు మండలంలోని కుచులపూర్ గ్రామంలో నూతనంగా విద్యుత్ సబ్ స్టేషన్లు కావాలని పలు మార్లు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ , కలిసి విన్నవించారు. అదే విధంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు ఉట్నూర్ మండలంలోని పెర్కాగుడా గ్రామానికి విచ్చేసినప్పుడు సైతం వినతిపత్రం అందజేయగా ఎట్టకేలకు బోథ్ నియోజకవర్గంలోని బోథ్ మండలంలో ధన్నూర్ బి, నెరడిగొండ మండలంలోని కుప్టి కుమారి మరియు తలమడుగు మండలంలోని కుచులపూర్ లో నూతనంగా 3 విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ . తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చుకునే దిశగా అడుగులు వేస్తానని, ఎమ్మెల్యే అయిన ప్రజా సమస్యలకై అందరినీ సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి వైపే వెళ్తానని తెలిపారు. ఇట్టి సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఈనెల 6వ తేదీన భూమి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.





# నవోదయ విద్యాలయం ఏర్పాటు అయ్యేదెప్పుడో!

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఏప్రిల్ 01(డి డి 9వార్త )**

ప్రతిభ ఉండి కుటుంబ ఆర్థిక స్థితి సరిగ్గా లేని గ్రామీణ ప్రాంతా విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయాలు ఓ వరం. 6 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం, యోగ, కరాటే వంటి అంశాల్లో ఈ విద్యా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. చిన్నతనం నుండే క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం అలవాటు పడేలా స్కౌట్స్, ఎన్సీసీ లను నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలలో ప్రవేశాలు పొందేందుకు నిర్వయించే జేఈఈ, నీట్ పరీక్షలకు సైతం ఇక్కడ అత్యుత్తమ శిక్షణను అందిస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఉన్నత విద్యా సంస్థల కేటాయింపులో మొండి చేయి రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విద్యా కేంద్రాల ఏర్పాటును కేంద్రం విస్మరించింది. 2025 26 లలో కొత్తగా ప్రకటించిన 7 ఏడు (భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, మహబూబ్ నగర్, మేడ్చల్ మల్కాజిగిరి, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట) నవోదయ విద్యా కేంద్రాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లేకపోవడం పట్ల ఈ ప్రాంత విద్యావంతుల్లో తీవ్ర నిరసన వ్యక్తం అవుతుంది. దేశంలోనే అత్యంత ప్రాముఖ్యత కల్గిన చదువుల తల్లి సరస్వతి దేవి ఈ ప్రాంతంలోనే కొలువై ఉన్నప్పటికీ సరైన విద్యా వనరులు లేక జిల్లా వాసులు నాణ్యమైన చదువుల కోసం అష్టకష్టాల మధ్య జిల్లాను దాటి వెళ్తున్నారు. మరికొంతమంది ఆర్థిక భారం, దూరభారం వలన మధ్యలోనే చదువులకు స్వస్తి పలుకుతున్నారు. తెలంగాణలో ఉన్న పాత పది జిల్లాల్లో యూనివర్సిటీ లేని ఏకైక జిల్లాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిలిచింది. గిరిజన యూనివర్సిటీ, మైనింగ్ యూనివర్సిటీ లలో ఏదో ఒకటి కచ్చితంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో జరిగిన ఓ సభలో త్వరలోనే ఆదిలాబాద్ జిల్లా లో యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కానీ నేటికి జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుపై స్పష్టత కరవైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేస్తారనుకున్న గిరిజన యూనివర్సిటీని ఉమ్మడి వరంగల్ జిల్లాలో, మైనింగ్ యూనివర్సిటీని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి నలుగురు ఎమ్మెల్యేలు, పార్లమెంట్ ఎన్నికలలో ఎంపీ గా బీజేపీ అభ్యర్థులు గెలిచినప్పటికీ కేంద్ర ప్రభుత్వం విద్యాలయాల ఏర్పాటులో జిల్లాను విస్మరించడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.




**ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు కల సాకరమయ్యేనా?**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం కాగజ్ నగర్ లో ఏకైక నవోదయ విద్యాలయం కొనసాగుతున్న విషయం తెలిసిందే. జిల్లాలో మరో నవోదయ విద్యాలయ ఏర్పాటు కొరకు ఆదిలాబాద్ జిల్లాలో మొదటగా భీంపూర్ మండలంలో స్థల పరిశీలన జరుపగా వివిధ కారణాల రీత్యా అక్కడ కాకుండా గుడిహత్నూర్ మండలం మన్నూరు శివారులో 30 ఎకరాల ప్రభుత్వ భూమిని జవహర్ నవోదయ విద్యాలయ భవన నిర్మాణానికి కేటాయిస్తూ పాఠశాల విద్యా కార్యదర్శికి గత ఏడాది జిల్లా కలెక్టర్ లేఖను సైతం రాసారు. మన్నూరు గ్రామం జాతీయ రహదారి (NH44) కి మూడు కిలో మీటర్ల దూరంలో ఉండటం, అవసరమైన భూమి ఒకే చోట లభించడం, భవిష్యత్తులో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది రాకపోకలకు అనువుగా ఉంటుందని ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇకనైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లో నూతన జవహర్ నవోదయ విద్యాలయంను త్వరితగతిన ఏర్పాటు చేసి ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తేవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.





# బోథ్ డివిజన్లో గాలివాన భీభత్సం, అడ్డం పడిన పంటలు, విరిగి పడిన చెట్లు,కొమ్మలు

**బజార్ హత్నూర్,ఏప్రిల్ 01:(డిడి 9వార్త న్యూస్ ):**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ డివిజన్లోని బజార్హత్నూర్,బోథ్, ఇచ్చోడ, నేరడి గొండ,సొనాల, సిరికొండ, గుడి హత్నూర్ తదితర మండలాల్లో బుధవారం రోజుసాయంత్రం 4 గంటల ప్రాంతంలోవడగల్లవాన,గాలిదుమారంతోమెరుపులు,ఉరుములతోభారీవర్షంపడింది.ఈదెబ్బకు మొక్క జొన్న చేల్లు, జొన్న చేల్లలోని పంటలన్నీ నేల కొరిగినవి. చేతికి వచ్చిన పంటలు ఇలా నేల పాలు కావడం ఈ పది హేను రోజులలో ఇది రెండో సారి.మామిడి కాయలు కూడా నేల పడినవి. చెట్లు, చెట్ల కొమ్మలు విరిగినవి. గాలి దూమారంతో కొన్ని ఊళ్ళల్లో ఇళ్ల పై కప్పులు ఎగిరి పోయాయి.రేకులుకూడా ఎగిరి పడి ఇళ్లలో వస్తువులు చిందర వందర చేశాయి. కరెంటుకు కూడా అంతరాయం కలిగినప్పటికి ఆశాఖ అధికారులు తక్షణమే స్పందించి కరెంటు పునరుద్దరింప చేశారు.



# ఐకెపి రాష్ట్ర స్థాయి ప్రథమ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

**నిజామాబాద్ జిల్లా 01 ఏప్రిల్ (డీడీ9 వార్త) :**

తెలంగాణ ఐకెపి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగాధర్ స్త్రీనిధిలో రాష్ట్ర స్థాయి ప్రథమ అవార్డు పొందడం మెండోర గ్రామస్తులకు గర్వకారణమని కమ్మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలేపు నరసయ్య కొనియాడారు. బుధవారం మెండోర గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కమ్మర్పల్లి మండలంలో మహిళా సంఘాల అభివృద్ధికి గంగాధర్ విశేష కృషి చేశారని, తెలంగాణ ఉద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎంపీడీవో సంతోష్ కుమార్ మాట్లాడుతూ 33 జిల్లాల్లోని వందలాది మండలాల ఏపీఎమ్‌లను వెనక్కి నెట్టి వరుసగా రెండోసారి రాష్ట్రస్థాయి ప్రథమ అవార్డును అందుకోవడం గంగాధర్ ప్రతిభకు నిదర్శనమని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ కుంట లక్ష్మీ రమేష్ మాట్లాడుతూ గంగాధర్ ఇప్పటివరకు వ్యక్తిగతంగా, సమాఖ్య పరంగా మొత్తం ఐదుసార్లు రాష్ట్రస్థాయి అవార్డులు, 11 సార్లు జిల్లా స్థాయి అవార్డులు సాధించి గ్రామానికి మంచి పేరు తెచ్చారని ప్రశంసించారు. బిజెపి మండల అధ్యక్షులు రవీందర్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా మహిళాభివృద్ధికి కృషి చేయడం, గంగాధర్ చూపే సహనమే ఆయన విజయాలకు మూల కారణమని అన్నారు. సన్మాన గ్రహీత కుంట గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను మహిళలకు సకాలంలో అందించాలనే లక్ష్యంతో, రోజువారీ ప్రణాళికలతో పని చేయడం వల్లే ఈ గుర్తింపు లభించిందని తెలిపారు. హక్కుల కోసం పోరాడే క్రమంలో బాధ్యతలను విస్మరించకూడదన్న సూత్రాన్ని తాను నమ్ముతానని, స్వగ్రామంలో తనను సన్మానించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బుచ్చన్న, భీమ్ గల్ ఏపీఎం ప్రమీల, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంకెట రవి, సీనియర్ నాయకులు పల్లె శేఖర్, వివిధ పార్టీల ప్రతినిధులు, ఐకెపి సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గంగాధర్‌ను ఘనంగా సన్మానించారు.




# వెంటనే వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- **బోధన్ సబ్ కలెక్టర్‌కు ఐక్య రైతు సంఘం వినతి**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 01 ఏప్రిల్ (డీడీ9 వార్త) :**

బోధన్ డివిజన్ పరిధిలో అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, వెంటనే వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు బుధవారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్ముల గంగాధర్, పుట్టి నడిపి నాగన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పార్వతి రాజేశ్వర్ మాట్లాడుతూ... బోధన్ ప్రాంతంలో వరి కోతలు మొదలైనప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల కారణంగా కోసిన పంట తడిసి మొలకలు వస్తున్నాయని, ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని దళారీలు తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ, తూకంలో తరుగు తీస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని వారు మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్వింటాల్ వడ్లకు మద్దతు ధరను 3500 రూపాయలకు పెంచాలని, అలాగే రైతులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ఏడాది వర్షాకాలంలో నష్టపోయిన పంటలకు కూడా ఇంతవరకు పరిహారం అందలేదని, తక్షణమే పాత మరియు కొత్త పంట నష్ట పరిహారాన్ని విడుదల చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి సుల్తాన్ సాయిలు, నాయకులు కాశ రవి, సిద్ధ పోశెట్టి, శ్రీపతి మల్లేష్, సుదర్శన్, కిరణ్, మైసయ్య, గోపాల్, గంగాధర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.






# పెద్ద మనసుతో 30 మంది పేదలకు సొంత భూమి దానమిచ్చిన పెద్దమ్మ.

**బజార్ హత్నూర్ ఏప్రిల్ 01 ( డిడి 9వార్త న్యూస్ ):-**

రక్తం పంచుకొని పుట్టినబందు మిత్రులకు సొంత అన్నదమ్ములకు, అక్క,చెల్లెల్లకు ఒక జానెడు జాగాను వదలి పెట్టని రోజులివి. ఇలాంటి విపరీత కాలంలో భూమి ఉన్న ఒక పెద్దమ్మ ఆమె సొంత భూమిని బంధుత్వాలు లేకున్న, రక్త సంబంధం కానప్పటికీని 30మంది పేదలకు 150 ఎకరాలు దానంగా ఏనుగు ఆశాతాయిరాసి ఇచ్చి,పంచి ఇచ్చింది. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రము లోని ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండలంలోనివర్త మన్నూర్ గ్రామంలో జరిగింది. ఆమె (తల్లి )నిర్ణయమే తన నిర్ణయం అని ఆమె కుమారుడు ఏనుగు విద్యా సాగర్ రెడ్డి ఈ మేరకు తల్లీకి తగ్గ కొడుకుగా ఆదర్శంగా నిలిచాడు.పలువురు వారిని అభినందించారు.

# నిజామాబాద్‌లో పోలీస్ నిఘా నీడన హనుమాన్ జయంతి

- **శోభాయాత్రకు సర్వం సిద్ధం**

**నిజామాబాద్ జిల్లా 01 ఏప్రిల్ (డీడీ9 వార్త) :**



నిజామాబాద్ నగరం నేడు జరగనున్న హనుమాన్ జయంతి శోభాయాత్రకు సర్వసిద్ధమైంది. కమీషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో ఉత్సవాలు అత్యంత వైభవంగా, అదే సమయంలో శాంతియుత వాతావరణంలో జరిగేలా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఈ మేరకు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య బందోబస్తు ప్రణాళికను వెల్లడించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ స్థాయిలో పోలీసు బలగాలను మోహరించారు. కేవలం స్థానిక పోలీసులే కాకుండా ఖమ్మం, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్ వంటి ఏడు జిల్లాల నుంచి అదనపు సిబ్బందిని రప్పించడం విశేషం. వీరితో పాటు టి.ఎస్.ఎస్.పి బెటాలియన్లు, 20 ప్రత్యేక స్పెషల్ పార్టీలు కలిపి దాదాపు 1300 మంది సిబ్బంది శోభాయాత్ర విధుల్లో నిమగ్నమై ఉంటారు. సాంకేతికతను జోడించి ఈసారి భద్రతను మరింత కఠినతరం చేశారు. శోభాయాత్ర ప్రారంభమయ్యే చోటు నుంచి ముగిసే వరకు దారి పొడవునా సి.సి కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా అణువణువూ పర్యవేక్షించనున్నారు. ఎత్తైన భవనాలపై పోలీసు సిబ్బందిని ఉంచి బైనాక్యులర్లతో నిశితంగా గమనించడంతో పాటు కొత్తగా ఇంటర్సెప్టర్ వాహనాన్ని కూడా రంగంలోకి దించారు. పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూసే వారిపై కఠిన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు. శోభాయాత్ర నిర్వాహకులు, భక్తులు, ప్రజలు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని, పుకార్లను నమ్మవద్దని, ప్రతి ఒక్కరూ స్నేహభావంతో ఉండి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

# దేవక్కపేట్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

**నిజామాబాద్ జిల్లా 01 ఏప్రిల్ (డీడీ9 వార్త) :**

భీమ్‌గల్ మండలం దేవక్కపేట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, పార్టీతోనే గ్రామాల ప్రగతి సాధ్యమని గ్రామ శాఖ అధ్యక్షులు అరికిల్ల సాయిలు స్పష్టం చేశారు. ప్రజా పాలనలో భాగంగా గ్రామానికి మంజూరైన నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఈరోజు అధికారికంగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి సహకారంతో 5 లక్షల రూపాయలు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి కృషితో మరో 10 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో మెరుగైన రవాణా సౌకర్యాల కోసం సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. తమ గ్రామానికి ఇంతటి భారీ నిధులు మంజూరు చేయించినందుకు మానాల మోహన్ రెడ్డి, ముత్యాల సునీల్ రెడ్డి, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి గ్రామస్తుల తరపున, పార్టీ కార్యకర్తల తరపున అరికిల్ల సాయిలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాలవత్ పూజ అజయ్ గారు, ఉప సర్పంచ్ లింగా రెడ్డి, గ్రామ ఉపాధ్యక్షుడు మాలవత్ రవి, మరియు నాయకులు మాలావత్ శ్రావణ్, గుంట నాగరాజు, మొర్రి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# సల్మాన్‌కు జోడీగా నయన్

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్‌తో దర్శకుడు వంశీ పైడిపల్లి ఓ చిత్రం తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. ఇందులో నయనతార కథానాయికగా నటించనున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. ఈ విషయాన్నే చిత్ర బృందం మంగళవారం అధికారికంగా ప్రకటించింది. యాక్షన్ ప్రాధాన్య చిత్రంగా భారీ స్థాయిలో నిర్మితం కానున్న ఈ సినిమా ఈనెలలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.



# వ్యాపారంలో తండ్రినే మించిపోయిన సారా అలీ ఖాన్..

బాలీవుడ్ యంగ్ స్టార్ సారా అలీ ఖాన్ కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, ఆదాయ వనరులను పెంచుకోవడంలోనూ తన తండ్రి బాటలోనే నడుస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ముంబైలోని అంధేరీ వెస్ట్‌లో ఉన్న తన ఖరీదైన బంగ్లాను ఒక ప్రైవేట్ విద్యా సంస్థకు లీజుకు ఇచ్చి భారీ డీల్ కుదుర్చుకున్నారు. 'ప్రాడిజీ మాంటిస్సోరి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థ ఈ ప్రాంగణాన్ని పాఠశాల అవసరాల కోసం అద్దెకు తీసుకుంది. కాగా ప్రాపర్టీ డేటా సంస్థ 'సీఆర్ఈ మ్యాట్రిక్స్' వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ లీజు ఒప్పందం మే 1, 2026 నుంచి అమలులోకి రానుంది.

కాగా నెలకు రూ. 6.5 లక్షలతో ఈ రెంట్ ప్రారంభమవుతుంది. అంటే చదరపు అడుగుకు రూ. 144.44 చొప్పున వసూలు చేస్తున్నారు. మొత్తంగా ఐదేళ్ల కాలానికి గాను సారా అలీ ఖాన్‌కు సుమారు రూ. 4.14 కోట్ల ఆదాయం రానుంది. అద్దెదారు ఇప్పటికే రూ. 20 లక్షలను సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించారు. అంతేకాదు ఐదేళ్ల లీజులో మూడేళ్ల పాటు 'లాక్‌ఇన్ పీరియడ్' ఉంటుంది, మూడవ ఏడాది నుంచి ప్రతి ఏటా అద్దె 5 శాతం మేర పెరుగుతుంది. ఇక సారా అలీ ఖాన్ మాత్రమే కాదు, బాలీవుడ్‌లోని ఇతర స్టార్స్ కూడా తమ ఆస్తులను లీజుకు ఇస్తూ భారీగా సంపాదిస్తున్నారు.

మాధురి దీక్షిత్.. లోయర్ పరేల్‌లోని ఆఫీస్ స్పేస్‌ను ఐదేళ్లకు రూ. 2.81 కోట్లకు లీజుకు ఇచ్చారు. శ్రద్ధా కపూర్.. జుహూలోని అపార్ట్‌మెంట్ కోసం ఏడాదికి రూ. 72 లక్షల రెంట్ చెల్లిస్తున్నారు. రాకేష్ రోషన్.. అంధేరీలోని కమర్షియల్ స్పేస్‌ను నెలకు రూ. 14.5 లక్షల అద్దెకు 'ఫ్యాబ్ ఇండియా'కు ఇచ్చారు. తమ సంపాదనను ఇలా రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడిగా పెట్టి, దాని ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందుతున్న సెలబ్రిటీల తీరు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది.



# సినిమా బాలేకున్నా "బ్యాండ్ మేళం" వాయించాలా?

కోర్టు సినిమాతో సూపర్ హిట్ అందుకున్న రోషన్, శ్రీదేవి మరోసారి జంటగా నటించిన తాజా చిత్రం 'బ్యాండ్ మేళం'. సతీష్ అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం అవుతూ ఈ సినిమాని తెరకెక్కించాడు. కోన వెంకట్ తన 'కోన వెంకట్ ఫిలిం కార్పొరేషన్' బ్యానర్ మీద తన కుమార్తెలిద్దరినీ నిర్మాతలుగా పరిచయం చేస్తూ ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది కానీ ఏ ఒక్కరినీ ఆకట్టుకోలేకపోయింది. "అవుట్ డేటెడ్ స్క్రీన్ ప్లే, అవుట్ డేటెడ్ స్టోరీ లైన్" అంటూ రివ్యూస్ లో సినిమాని ఏకిపారేశారు రివ్యూ రైటర్లు.

అయితే ఇదే విషయం మీద, నిన్న సక్సెస్ కాకపోయినా సక్సెస్ మీట్ నిర్వహించుకున్న సినిమా టీం బాగా ఫైర్ అయింది. అందరూ కూడబలుక్కుని రివ్యూ రైటర్ల గురించి మాట్లాడాలి అనుకునే వచ్చినట్లుగా, దాదాపుగా అందరూ రివ్యూ రైటర్లపై విమర్శలు గుప్పించారు. దర్శకుడు అయితే "మీ రివ్యూలు మాకు మరణ శాసనాలు" అంటూ భారీ డైలాగులు కూడా వాడారు. వాస్తవానికి సినిమా బాగుంటే బాగుందని, లేదంటే లేదని రివ్యూ రైటర్లు తమ రివ్యూలలో మెన్షన్ చేస్తూ ఉంటారు. అలాగే అన్ని రివ్యూలు ఏకపక్షంగా బాగుందనో, బాగోలేదనో చెప్పడం కూడా చాలా తక్కువ సందర్భాల్లోనే చూస్తూ ఉంటాం. అయితే 'బ్యాండ్ మేళం' విషయానికి వచ్చేసరికి సినిమా బాలేదని ముక్తకంఠంతో దాదాపు అన్ని వెబ్సైట్స్ తేల్చి పడేసాయి. ఒకరిద్దరు తప్పుగా రాస్తే అనుకోవచ్చు, కానీ అన్ని వెబ్ సైట్స్ ఏమీ సదరు సతీష్ మీద, లేదా కోన వెంకట్ మీద కక్ష కట్టి నెగటివ్ రివ్యూస్ రాయరు కదా. అయితే దీన్ని నిర్మాణాత్మకంగా, వివరణాత్మకంగా రాసిన వెబ్సైట్స్ కూడా ఉన్నాయి. ఆ విషయం పట్టించుకోకుండా దర్శకుడు సహా సినిమాలో నటించిన కొంతమంది నటీనటులు సైతం రివ్యూ రైటర్ల మీద విరుచుకుపడ్డారు. సినిమా బాగుంటే దాన్ని పనిగట్టుకొని విమర్శించాల్సిన అవసరం రివ్యూ రైటర్లకు లేదు. ఒకరైతే "రివ్యూ రైటర్లను మేనేజ్ చేయలేదా?" అంటూ కోన వెంకట్ నే ప్రశ్నించారు. ఆయన దానికి "లేదని" సమాధానం చెప్పారు. నిజానికి రివ్యూ రైటర్లను మేనేజ్ చేసే పరిస్థితి ఉంటుందా అంటే, అది లేదనే దాదాపుగా సినీ పరిశ్రమలో ఉన్న అందరికీ తెలుసు.

ఇక్కడ ఉన్న పరిచయాల కొద్దీ తమకు బాగా తెలిసిన దర్శకులు, నిర్మాతలు లేదా నటీనటుల సినిమాలకు కొంతమేర నెగెటివిటీ తగ్గించి రివ్యూ రాయగలరేమో కానీ, బాలేని సినిమాని బాగుందని రాస్తే ఆయా వెబ్సైట్లకు క్రెడిబిలిటీ పడిపోతుంది; కాబట్టి ఎవరూ అంత సాహసానికి పూనుకోరు.

కానీ ఇదే జంట హీరో హీరోయిన్లుగా నటించిన 'కోర్టు' సినిమాకి మాత్రం ప్రేక్షకులతో పాటు రివ్యూ రైటర్లు సైతం బ్రహ్మరథం పట్టారు. అప్పుడు వారిని ఎవరు మేనేజ్ చేసినట్టు? అంతేకాక అదే దర్శకుడికి నాని మరోసారి అవకాశం కూడా ఇచ్చారు. ఇప్పుడు




ఇదే కోన వెంకట్, ఈ సినిమాను డైరెక్ట్ చేసిన సదరు దర్శకుడికి మరో అవకాశం ఇవ్వగలరా?

అలానే ఇటీవల రిలీజ్ అయి బ్లాక్ బస్టర్ టాక్ తో పాటు రివ్యూస్ అందుకున్న దురంధర్ విషయంలో ఎవరు ఎవర్ని మేనేజ్ చేశారో? కూడా సదరు నటీమణి మాట్లాడి ఉంటే బాగుండేది. నిజానికి ఈ సినిమాలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయి. అలా అని సినిమా మొత్తం తీసి పక్కన పెట్టమని ఎవరూ రివ్యూ రాయలేదు. తమకు సినిమాలో ఉన్న కంప్లైంట్స్ తమ వేదికల ద్వారా, కొంతమంది వెబ్సైట్స్ లో, కొంతమంది యూట్యూబ్ ఛానల్స్ లో వ్యక్తపరిచారు. ఆ వ్యక్తపరచడాన్ని కూడా ఈ 'బ్యాండ్ మేళం' టీం తట్టుకోలేకపోతోంది అంటే, వాళ్ళు ఇంకా తమ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అనే భ్రమ నుంచి బయటకు వస్తే బెటర్. నిజానికి బాహుబలి లాంటి సినిమాకి కూడా భారీ రేటింగ్స్ ఏమీ రాలేదు, కానీ ఆ సినిమా జనానికి నచ్చింది కాబట్టి బ్రహ్మరథం పట్టి, ఇప్పటికీ బద్దలు కొట్టలేని స్థాయిలో రికార్డులు సాధించింది. అయితే ఇదే విషయాన్ని మరిచి తమ సినిమాని మీడియానే చంపేసింది అన్నట్లుగా సదరు దర్శకుడు సహా నటీనటులు, సినిమా టీమ్ అంతా మాట్లాడటం ఎంతవరకు కరెక్ట్? వారికి వారే ఆలోచించుకోవాలి.

# కృతి ఈజ్ బ్యాక్.. గుడ్ టైం మళ్లీ స్టార్ట్ అయినట్టేనా?

ప్రదీప్ రంగనాథన్ హీరోగా, 'ఉప్పెన' బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. తాజాగా ఈ సినిమా తెలుగు టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. దాదాపు ఏడు నెలల క్రితమే తమిళంలో వచ్చిన ఈ టీజర్‌ను.. ఇప్పుడు చిన్నపాటి మార్పులతో టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి చేతుల మీదుగా విడుదల చేశారు. టీజర్ చూస్తుంటే.. నయనతార భర్త, దర్శకుడు విఘ్నేష్ శివన్ ప్రేక్షకులను 2040 నాటి కాలానికి తీసుకెళ్లబోతున్నట్లు అర్థమవుతోంది. ఫ్యూచరిస్టిక్ అంశాలతో కూడిన ఫన్ అండ్ రొమాంటిక్ ఎంటర్టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం.. ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఇన్‌స్టంట్ రిలేషన్‌షిప్‌ను ఇష్టపడని కృతి శెట్టి .. పాతకాలం నాటి స్వచ్ఛమైన ప్రేమను కోరుకుంటుంది. సరిగ్గా అలాంటి సమయంలోనే ఆమెకు ప్రదీప్ రంగనాథన్ పరిచయమవుతాడు. అయితే వీరి ప్రేమకథకు 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' యజమాని ఎస్.జె. సూర్య ఎలా అడ్డుపడ్డాడు?, అసలు ఆ కంపెనీ ఏం చేస్తుంది? అనే ఆసక్తికరమైన అంశాలతో టీజర్ సాగింది. ప్రజెంట్ ఈ టీజర్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండగా.. ఈ సినిమాతో బేబమ్మ ఖాతాలో బ్లాక్ బస్టర్ పడినట్టే కనిపిస్తోంది.

మొదటి సినిమా ఉప్పెనతో వంద కోట్ల హిట్ అందుకున్న కృతి శెట్టి.. అదే జోష్‌లో హ్యాట్రిక్ హిట్ అందుకుంది. కానీ ఆ తర్వాత అమ్మడికి ఒక్క సాలిడ్ హిట్ కూడా పడలేదు. కానీ ఇపుడు వంద కోట్ల సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్‌తో ఛాన్స్ అందుకుంది. లవ్ టుడే, డ్రాగన్, డ్యూడ్ వంటి సినిమాలతో హ్యాట్రిక్ వంద కోట్ల హిట్స్ అందుకున్న ప్రదీప్.. మరోసారి లవ్ ఇన్సూరెన్స్ కంపెనీతో వంద కోట్ల క్లబ్‌లో చేరేలా ఉన్నాడు. అదే జరిగితే టాలీవుడ్‌లో కృతి టైం మళ్లీ స్టార్ట్ అయినట్టే. మరలా వరస అవకాశాలను బేబమ్మ అందుకుంటుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.






# రిలీజ్ కు రెడీ అవుతున్న 'జననాయగన్'

లీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ నటిస్తున్న చివరి చిత్రం 'జన నాయగన్' విడుదల కోసం అభిమానులు కోటి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రాజకీయ నేపథ్యంతో కూడిన ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, గత కొంతకాలంగా ఈ సినిమా విడుదల తేదీ విషయంలో సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో, తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ నెట్టింట హల్చల్ చేస్తోంది.

వాస్తవానికి ఈ చిత్రాన్ని ఈ ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 9, 2026న విడుదల చేయాలని చిత్ర బృందం అన్ని ఏర్పాట్లు చేసుకుంది. కానీ చిత్రంలోని కొన్ని కీలక రాజకీయ డైలాగులు మరియు సన్నివేశాలపై సెన్సార్ బోర్డు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పాటు కోర్టులో ఉన్న కొన్ని పెండింగ్ ఇష్యూస్ వల్ల నిర్ణీత సమయానికి సినిమా విడుదల కాలేదు. ఇది విజయ్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. తాజా సమాచారం ప్రకారం మేకర్స్ ఇప్పుడు సమ్మర్ విడతను లక్ష్యంగా చేసుకున్నారు. ముఖ్యంగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రభావం సినిమాపై పడకుండా చిత్ర యూనిట్ జాగ్రత్త పడుతోంది. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే అంటే ఏప్రిల్ 24న సినిమాను థియేటర్లలోకి తీసుకురావాలని నిర్మాతలు యోచిస్తున్నట్లు సమాచారం. ఈ తేదీన సినిమాను విడుదల చేయడం ద్వారా ఎన్నికల వేడిలో ఉన్న ప్రజలను థియేటర్లకు రప్పించవచ్చని భావిస్తున్నారు. విజయ్ సినిమా విడుదలైన వారం రోజుల వ్యవధిలోనే మరో స్టార్ హీరో ధనుష్ నటించిన 'కరా' ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధంగా ఉంది. దీంతో ఏప్రిల్ ఆఖరి వారంలో బాక్సాఫీస్ వద్ద ఇద్దరు అగ్ర హీరోల మధ్య గట్టి పోటీ నెలకొననుంది. మరి సెన్సార్ అడ్డంకులు దాటుకుని 'జన నాయగన్' చెప్పిన తేదీకే వస్తుందో లేదో చూడాలి.

# దండోరా డైరెక్టర్‌తో నాని కొత్త సినిమా ఫిక్స్

నేచురల్ స్టార్ నాని సినిమాల్లో నటించడం మాత్రమే కాకుండా కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వాల్ పోస్టర్ సినిమా అనే బ్యానర్ స్థాపించి, వరుసగా సరికొత్త కాన్సెప్ట్‌లతో చిత్రాలను నిర్మిస్తూ వస్తున్నారు. ఈ బ్యానర్ ద్వారా ఇప్పటికే పలువురు యువ దర్శకులకు అవకాశాలు ఇచ్చిన నాని, తాజాగా మరో యంగ్ డైరెక్టర్‌కు ఛాన్స్ ఇవ్వబోతున్నట్లు సమాచారం. పోయిన సంవత్సరం డిసెంబర్ నెలలో విడుదలైన దండోరా చిత్రం ప్రేక్షకుల ప్రశంసలను అందుకున్న విషయం తెలిసిందే.

ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమైన మురళీకాంత్ దేవాసోత్ తన డెబ్యూ మూవీతో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. ఇప్పుడు ఈ దర్శకుడు తన రెండో సినిమాను నాని నిర్మాణ సంస్థలో చేయబోతున్నట్లు ఫిలిం వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ కొత్త ప్రాజెక్ట్‌లో యువ నటుడు నాస్లెన్ కథానాయకుడిగా కనిపించబోతున్నట్లు సమాచారం. నాస్లెన్ తెలుగులో ఇప్పటివరకు సినిమాలు చేయకపోయినా, అనేక మలయాళ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపును సంపాదించుకున్నారు. ఇప్పటికే ఈ క్రేజీ కాంబోకు సంబంధించిన కథ చర్చలు పూర్తయినట్లు, మరికొన్ని రోజుల్లోనే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

